
సాక్షి కాకినాడ

బుధవారం | 2 | ఆగస్టు | 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



రూ.50 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి శిఖా శ్రీనివాసరావు, నాగమణి దంపతులు (అమలాపురం మండలం పేరూరు) మంగళవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

ఇతరులకు అన్నదానం.. నో



సత్యదేవుని నిత్యాన్న ప్రసాద పథకం(అన్నదానం)లో ఇకపై భక్తులు మినహా ఇతరులెవ్వరూ భోజనం చేయడానికి వీలు లేదు. ఈ మేరకు అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్ర శేఖర్ అజాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

8లో

న్యూస్‌రీల్

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 అర్జీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 13 మంది వచ్చి తమ సమస్యలు విన్నవించారు. విద్య,ఉపాధి,డ్రైనేజీ, లేఔట్‌ల క్రమబద్ధీకరణ తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వీరి అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులకు అదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీధర్ రెడ్డి,ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలు పొడిగింపు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలోని త్రీమెన్ కమిటీలకు మరో 6 నెలల పాటు పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర సహకారశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 72 సంఘాలకు గాను కొత్తగా ఐదు సహకార సంఘాల్లో మార్పులు చేశారు. కొన్ని సంఘాలకు త్రీమెన్ కమిటీ మొత్తం మార్చగా, మరికొన్ని సంఘాలకు కొత్త సభ్యులు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన 67 కమిటీలకు పాత త్రీ మెన్ కమిటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లే కొనసాగనున్నారు. ఆయా కమిటీల్లో ఎటువంటి మార్పులు లేవు. ఈ ఉత్తర్వుల ప్రకారం సహకార సంఘాలు త్రీమెన్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్‌లు 2024 జనవరి 31 వరకూ కొనసాగనున్నారు.

కొత్త సభ్యులు

కాజులూరు మండలం జగన్నాథగిరి సహకార సంఘానికి కాకర్లపూడి వీరభద్రరాజు పర్సన్ ఇన్‌చార్జిగా, సభ్యులుగా పోతుల వీర ప్రసాద్, నురుకుర్తి శ్రీనివాసరావు, కోలంక సహకార సంఘానికి తొగరు చంద్రశేఖర్‌బాబు పర్సన్ ఇన్‌చార్జి, సభ్యులుగా పాలిక బర్రెల్లు, మేడిశెట్టి వీరాస్వామి నియమితులయ్యారు. , గండేపల్లి సహకార సంఘంలో ఒక సభ్యున్ని మార్చారు. ఉప్పలపాడు సహకార సంఘంలో పాము సూరిబాబును పర్సన్ ఇన్‌చార్జిగా, చెరుకు సూర్యనారాయణ, గొల్లవిల్లి రామకృష్ణను సభ్యులుగా నియమించారు. మల్లేపల్లి సంఘంలోను త్రీమెన్ కమిటీ పాత సభ్యునికి బదులుగా కొత్త సభ్యున్ని నియమించారు.

18న సత్య విధియ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



అన్నవరం: సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం సత్య విధియ సందర్భంగా ఈనెల 18న దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈఓ ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. 17వ తేదీ తెల్లవారుజామున స్వామి, అమ్మవారి మూల విరాట్‌లకు పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. అనివేటి మండపంలో ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణలు, వేదపారాయణలు, జపములు, మంటపారాధనలు, నవగ్రహ మూల మంత్ర జపములు, చండీ పారాయణలతో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సాయంత్రం ఆయుష్యహోమం ప్రారంభమవుతుంది. 18వ తేదీ తెల్లవారుజామున 2–30 గంటలకు సుప్రభాత సేవ, నాలుగు గంటలకు అభిషేకం అనంతరం స్వామివారి దర్శనం. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో వెండి రథంపై ఊరేగింపు, ఉదయం 11 గంటలకు ఆయుష్యహోమం పూర్ణాహుతి ఉంటుందన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన నిత్య కల్యాణ మండపంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరుగుతుందని ఈఓ వివరించారు.

6 నుంచి హిందూ ప్రచార మాసోత్సవాలు

దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి హిందూ ధర్మ ప్రచార మాసోత్సవాలను నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ మంగళవారం తెలిపారు. ప్రచార మాసోత్సవాలను సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఆరోజు ఉదయం 8 గంటలకు, దేవదాయ, ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభిస్తారన్నారు. భారీ ఊరేగింపుతో సత్యదేవుని ఆలయానికి చేరుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు ఆయన పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం కొండ దిగువన సత్యదేవుని ప్రచార రథానికి జెండా ఊపి ధర్మప్రచారం ప్రారంభిస్తారు. తరువాత అన్నవరానికి సమీపంలోని ఒక ఆలయంలో సత్యదేవుని శాంతి కల్యాణం నిర్వహిస్తామని ఈఓ వివరించారు.

రేపు జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం వాకలపూడి సాయి ఆయిల్ ఫీల్డ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు మంగళవారం తెలిపారు. 2019–22 మధ్యలో ఫిట్టర్, కట్టర్, వెల్డర్ రంగాల్లో ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చని, ఎంపికైన వారు దుబాయ్‌లో పనిచేయాలన్నారు. ఇతర వివరాలకు 99491 56583 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు.

ప్రసవం పదిలం

- మూడొంతులు సుఖ ప్రసవాలే
- తగ్గిన మాతృ మరణాలు
- ఫలితాన్నిస్తోన్న అందరికీ వైద్యం
- 70 నుంచి 25కు తగ్గిన ప్రసూతి మరణాలు
- ప్రసూతివైద్యంలో మేటి కాకినాడ జీజీహెచ్



జీజీహెచ్ ప్రసూతి విభాగంలో పోస్టునాటల్ వార్డు

సాక్షిప్రతినిధి, కాకినాడ: వైద్య రంగంలో ప్రభుత్వ సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. గడచిన నాలుగేళ్లుగా ఈ రంగాన్ని క్షేత్ర స్థాయిలో అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పటిష్టం చేయడంతో రెట్టింపు సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్యులు సహా ఖాళీ పోస్టుల భర్తీ, మౌలిక వసతులు మెరుగుపరచడం, ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్ వంటి విప్లవాత్మకమైన మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అన్ని రకాల వైద్య సేవలు ఇంటి ముంగిటకే చేరడంతో ప్రసూతి వైద్య సేవల్లో రాష్ట్రంలోనే మేటిగా నిలిచే కాకినాడ జీజీహెచ్‌పై ఒత్తిడి తగ్గింది.

గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే ప్రసూతి మరణాలు రేటు గడచిన మూడు, నాలుగు సంవత్సరాలుగా బాగా తగ్గడం విశేషం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సామాన్యులు, మధ్యతరగతి వర్గాలకు కాకినాడ జీజీహెచ్ ప్రధాన ఆస్పత్రి. ఈ మూడు జిల్లాలో ఎక్కడ ఏ ప్రమాదం సంభవించినా సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఈ ఆస్పత్రే ఆధారం. మారుమూల పల్లె నుంచైనా గర్భిణులు పురుడు పోసుకోవాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది కాకినాడ జీజీహెచ్. ఇక్కడ సాధారణ ప్రసవాలకు అవకాశం ఎక్కువ. తల్లీబిడ్డ క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్తారని ప్రజల నమ్మకం. మాతాశిశు విభాగంలో ప్రసవాల గణాంకాలే ఇందుకు తార్కాణం.

ప్రసవం కోసం వెళితే కార్పొరేట్ ఆస్పత్రులలో నిలువుదోపిడీకి గురవుతున్నారు. సాధారణ ప్రసవానికే తక్కువలో తక్కువగా రూ.40వేలు వసూలు చేస్తున్నారు. సిజేరియన్ ప్రసవాలైతే రూ.70వేలు నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్న పరిస్థితులు. ఈ పరిస్థితిని కళ్లారా గమనిస్తున్న గర్భిణుల కుటుంబీకులు ఒకప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో అక్కడే పురుడుపోసుకునే వారు.



జీజీహెచ్‌లోని మాతాశిశు విభాగం

ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వైద్యాన్ని బలోపేతం చేయడంతో ఈ వర్గాలకు ప్రసవ వేదన తప్పింది. హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక ఐసీయులో వెంటిలేటర్ అనుసంధానంతో సేవలందిస్తున్నారు. అత్యంత నాణ్యమైన సేవలతో తల్లికి పునర్జన్మ ఇచ్చి బిడ్డను సంరక్షించడంలో జీజీహెచ్ మాతాశిశు విభాగానికి విశేషమైన అనుభవం ఉంది.

ఆరు యూనిట్లలో సేవలు

జీజీహెచ్‌లో ఆరు యూనిట్లలో మూడు దశాబ్దాల అనుభవం కలిగిన ప్రొఫెసర్ల పర్యవేక్షణలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందుతున్నాయి.

ప్రసవ వివరం	2019	2020	2021	2022
సాధారణ ప్రసవాలు	7668	6667	5668	5191
సిజేరియన్‌లు	3288	3012	2626	2954
మొత్తం ప్రసవాలు	10956	9679	8294	8145
మాతృ మరణాలు	37	37	57	25
అబార్షన్‌లు	205	214	230	196
మొత్తం ఓపీ కేసులు	16659	6891	11009	15723

హైరిస్క్ గర్భిణులకు వరం



ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల్లో హైరిస్క్ కేటగిరీతో ప్రాణాపాయంతో వచ్చే గర్భిణులతో పాటు సాధారణ ప్రసవాలు కోరుకునే వారికి జీజీహెచ్ ఒక వరం. పైసా ఖర్చు లేకుండా అత్యంత నాణ్యమైన వైద్య సేవలందించాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సేవలందిస్తున్నారు. అధునాతన వైద్య పరికరాలు, వెంటిలేటర్‌ల అనుసంధానంతో గర్భిణీలు, గర్భస్థ శిశువులను ప్రత్యేక సంరక్షణ వ్యవస్థ జీజీహెచ్‌లో ఉంది.

– డాక్టర్ హేమలతాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ.

ఎంతో నమ్మకంతో గర్భిణులను జీజీహెచ్‌కు తీసుకువస్తున్నారు. జీజీహెచ్ సేవలకు సమాంతరంగా క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు బలోపేతం కావడం కూడా ఆయా వర్గాలకు మనో ధైర్యాన్నిస్తోంది. మాతృ మరణాలతోపాటు మాతృత్వ మాధుర్యాన్ని చిదిమేసే అబార్షన్ల సంఖ్య కూడా తగ్గింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గడచిన నాలుగేళ్లుగా ప్రసూతి మరణాలు తగ్గుదల, సాధారణ ప్రసవాల సంఖ్య ఏటేటా పెరుగుతూ సిజేరియన్‌లు తగ్గుతుండటం విశేషంగా చెబుతున్నారు. జీజీహెచ్‌లో ఏటా 3500 వరకు నమోదయ్యే సిజేరియన్లు ప్రస్తుతం 2500కు తగ్గడం గమనార్హం.

చక్కని సేవలతో ఆదరణ



పురుడుపోసుకోవడానికి కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాను. ఆ ఆస్పత్రిలో సిజేరియన్ చేయాలి తప్పదన్నారు. రూ.80వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. నా భర్త ఆటో డ్రైవర్. అంత భరించే స్తోమత లేదు. స్థానికులు చెప్పిన మీదట కాకినాడ జీజీహెచ్‌కు వచ్చాను. చక్కటి వసతుల మధ్య వైద్యులు, నర్సులు ఎంతో బాగా చూసుకున్నారు. గత ఆదివారం మగబిడ్డను ప్రసవించాను. సాధారణ ప్రసవమే చేశారు.

– కొటింగ మరియా, రామేశ్వరం, కాకినాడ రూరల్

పంట రుణాల మంజూరు వేగవంతం

జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశం



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో రైతులతో పాటు, కౌలు రైతులుకు పంట రుణాలు మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, ఇతర జిల్లా స్థాయి అధికారులతో కలిసి కౌలు రైతు గుర్తింపు కార్డులు పంపిణీ, పంట రుణాల మంజూరు, ఓటర్లజాబితా తనిఖీ, వలంటీర్లు ఎడ్యుకేషన్ సర్వే వంటి అంశాల పురోగతిపై క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 94 శాతం మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామన్నారు. అర్హత ఉన్న కౌలు రైతులకు పూర్తి స్థాయిలో కార్డులు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని నూరుశాతం రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా తనిఖీని ప్రణాళికయుతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న భవనాలును ఈ 15న ప్రారంభించే విధంగా చివరి దశ పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్‌క్లినిక్ భవనాలు నిర్మాణ పనుల్లో పురోగతి కనబర్చాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే ఆయా బిల్లులు అప్లోడ్ చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ నాగమణి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం శ్రీనివాస్, ఎల్‌డియం ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు



కాకినాడ మెయిన్‌రోడ్ బ్రిడ్జి డౌన్‌లో ఏర్పాటు చేసిన సాత్విక్ సాయిరాజ్ హోర్డింగ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్–14,16 బాలుర విభాగంలో క్రీడాకారుల ఎంపికలు గురువారం నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి పి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలోని క్రికెట్ నెట్స్‌లో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు. ఆసక్తి గలవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావావలి ఆయన కోరారు.

ఆకట్టుకున్న సాత్విక్ సాయిరాజ్ హోర్డింగ్

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ప్రపంచరికార్డు సాధించిన సందర్భంగా నగరంలోని టూటౌన్ బ్రిడ్జిడౌన్‌లో హరీష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్ క్రీడాభిమానులను ఆకట్టుకుంటుంది. కొరియా ఓపెన్ బీడబ్ల్యూ 500 టోర్నీ విజేతగా నిలిచి, ప్రపంచంలో ఫాస్టెస్ట్ బ్యాడ్మింటన్ షాట్‌గా 565 కిలో మీటర్ల స్పీడ్‌తో హిట్ చేసి ప్రపంచ రికార్డు సాధించడం జిల్లాకు గర్వకారణం అని, అందుకే ఈ హోర్డింగ్ ఏర్పాటు చేశామని ట్రస్ట్ చైర్మన్ హరీష్ తెలిపారు.

ఏడేళ్ల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం

- నిషేధిత జాబితా నుంచి భూ విభజన
- ఆనందం వ్యక్తం చేస్తున్న యజమానులు



కాకినాడ లీగల్: ఏడేళ్ల సమస్యపై అధికారులు చొరవ తీసుకుని పరిష్కారం చూపారు. వివరాలివి. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 35లో 40 ఎకరాల 20 సెంట్లు భూమి ఉంది. అదే సర్వే నెంబర్‌లో ఎకరం భూమి దేవదాయ ధర్మాదాయశాఖకు ఉంది. దీంతో 35వ సర్వే నెంబర్ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ కారణంగా మిగిలిన 39 ఎకరాల 20 సెంట్లు భూమికి సంబంధించిన యజమానులు ఇరకాటంలో పడ్డారు. తమ భూములను అమ్ముకోవడానికి, కొనుగోలు చేయడానికి, రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుపడలేదు. గత ప్రభుత్వ హయాంలో నుంచి ఏడు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యక్తులు ఈ సమస్యను జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ డిఐజీ ఎ.నాగలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సర్వే నెంబర్‌లో ఎకరం ఎండోమెంట్ భూమి ప్రొహిబిటెడ్ (నిషేధిత జాబితా)లో ఉండడంతో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరగకపోడంతో రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయానికి గండిపడుతున్న విషయాన్ని వారు గుర్తించారు. కలెక్టర్‌తో పాటు రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్ళారు. కలెక్టర్, రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారులు సమన్వయంతో సర్వే నెంబర్ 35ను సబ్ డివిజన్‌గా చేశారు. 35/1 సర్వేనెంబర్‌లో 39 ఎకరాల 20 సెంట్లను ప్రైవేటు భూమిగా చూపించారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వెసులుబాటు కలిగింది. బాధితులకు ఊరట కలగడంతోపాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. సర్వేనెంబర్ 35/2ను ఎండోమెంట్‌కు భూమిగా చూపి నిషేధిత జాబితాలో చూపించారు. ఏడేళ్లుగా వెంటాడుతున్న సమస్యకు మోక్షం కలిగడంతో భూయజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యకు పరిష్కారం చూపాం



ఏడేళ్ల నుంచి భూములు అమ్ముకోలేక, కొనలేక, కుటుంబ సభ్యులపేరిట రిజిస్ట్రేషన్లు చేసుకోలేక కొందరు ఇబ్బందులు పడుతున్న ప్రైవేటు భూ యజమానుల సమస్యను గుర్తించాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించాం. దేవదాయశాఖకు చెందిన ఎకరం భూమిని సర్వేనెంబర్ 35/2గా ఏర్పాటు చేసి నిషేధిత జాబితాలో ఉంచాం.

– రామలక్ష్మి పట్నాయక్, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ

రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు



సర్పవరంలో సర్వే నెంబర్ 35ను సబ్‌డివిజన్ చేసి, ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూములను సర్వేనెంబర్ 35/1గా ఏర్పాటు చేశారు.దీంతో ఇక నుంచి ఈ సర్వేనెంబరులో గల భూ యజమానులు క్రయవిక్రయాలు చేసుకోవడానికి, అలాగే రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి ఎటువంటి ఆటంకాలు లేవు.

– కె.వెంకటేష్, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్, సర్పవరం

సర్టిఫికెట్లు..తప్పిన పాట్లు

- జగనన్న సురక్ష కింద 2.30 లక్షల సర్టిఫికెట్ల జారీ
- సంతృప్తకర స్థాయిలో ప్రభుత్వం సేవలు
- జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

బాలాజీచెరువు(కాకినాడసిటీ): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలో 2,68,326 సేవా విజ్ఞప్తులను పరిష్కరించినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాల్‌లో ఈ కార్యక్రమం ద్వారా అందించిన సేవలను ఆమె మీడియా సమావేశంలో వివరించారు. జూన్ 23న ప్రారంభించిన జగనన్న సురక్ష జూలై నెలాఖరు కొనసాగిందన్నారు. నూరు శాతం సంతృప్తి స్థాయిలో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించగలిగామన్నారు. జిల్లాలోని 620 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజావసరాలను గుర్తించారన్నారు. అక్కడే వారికి టోకెన్ల జారీ చేశారన్నారు. అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొని దగ్గర ఉండి మరి దరఖాస్తులను నింపారన్నారు. జూలై 1 నుంచి తహసీల్దారు, ఈవోపీఆర్‌డీ టీమ్‌గా.. ఎంపీడీవో, డిప్యూటీ తహసిల్దార్ మరో టీమ్‌గా ఏర్పడి ప్రతి సచివాలయం పరిధిలో క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లను అందించారన్నారు.

1,23,687 ఇంటెగ్రేటెడ్ సర్టిఫికెట్ల జారీ:

సాధారణంగా జిల్లాలో నెలకు సగటున 10 వేల నుంచి 11 వేల (వివిధ రకాల) సర్టిఫికెట్లను జారీ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష ద్వారా 2.30 లక్షలకుపైనే సర్టిఫికెట్లు ఉచితంగా అందిచామనన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా ఇళ్ల వద్దే సర్టిఫికెట్లు, సేవలు పొందారన్నారు. 1,23,687 ఇంటిగ్రేటెడ్ క్యాస్ట్, 1,13,653 ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీచేసినట్లు వెల్లడించారు. ఆధార్ కార్డుతో మొబైల్ నంబర్ అనుసంధానానికి సంబంధించి 10,911 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. రైస్ కార్డులోని సభ్యుల విభజన, సభ్యుల చేర్పులకు సంబంధించి 2,459 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భూమిక పోషించారన్నారు.

మండలం	సర్టిఫికెట్ల సంఖ్య
కాకినాడ అర్బన్	29,703
ప్రత్తిపాడు	24,060
తాళ్లరేవు	15,736
కాజులూరు	15,085
కాకినాడ రూరల్	15,067

సర్టిఫికెట్ల జారీలో టాప్ మండలాలు

జేకేసీలో జిల్లా టాప్

జగనన్నకు చెబుదాం (జేకేసీ–1902) కార్యక్రమం కింద ఇప్పటివరకూ 5,076 గ్రీవెన్స్‌లు నమోదయ్యాయని కలెక్టర్ కృతికాశుక్లా పేర్కొన్నారు.. వీటిలో 84 శాతం అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. రెవెన్యూ, ఈపీడీసీఎల్, పంచాయతీరాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, పోలీస్ శాఖల పరిధిలో ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూకి సంబంధించి ఎక్కువగా సివిల్ వివాదాలపై అర్జీలు వస్తున్నందున మండలస్థాయిలో తహసీల్దార్, సీఐ, ఈవోపీఆర్‌డీలతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి ప్రతి మంగళవారం పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీధర్‌రెడ్డి సమావేశంలో డిఐపిఆర్‌ఓ డి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గుముఖం

- ధవళేశ్వరం వద్ద ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ
- కోనసీమ జిల్లాలో తేరుకుంటున్న లంకలు

సాక్షి, అమలాపురం/ధవళేశ్వరం: గోదావరి శాంతించింది. మంగళవారం వరద ఉధృతి బాగా తగ్గింది. ఫలితంగా కాటన్ బ్యారేజ్ వద్ద రెండు,మొదటి ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించారు. మంగళవారం తెల్లవారుజామున 13.70 అడుగులకు నీటి మట్టం చేరడంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అనంతరం క్రమేపి తగ్గుతూ మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు 11.70అడుగులకు నీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించారు. మరో ప్రక్క ఎగువ ప్రాంతాల్లో కూడా నీటి మట్టాలు బాగా తగ్గుముఖం పట్టాయి. ఈ ప్రభావంతో ధవళేశ్వరం బ్యారేజి వద్ద బుధవారం వరద తీవ్రత మరింత తగ్గే అవకాశం ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మంగళవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం వద్ద 10.60 అడుగులకు నీటి మట్టం చేరింది. 8,17,758 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. మరో పక్క భద్రాచలంలో నీటి ఉధృతి కూడా తగ్గింది. రాత్రి 7గంటలకు 28.40 అడుగులకు నీటిమట్టం చేరింది. వరదల సీజన్ ప్రారంభమయ్యాక ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ఇప్పటివరకు 1212టీఎంసీల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

తేరుకుంటున్న లంకలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లంక గ్రామాల్లోని మెరక ప్రాంతాల్లో రోడ్లు, ఇళ్లు ముంపు నుంచి బయట పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, రోడ్లు, కాజ్‌వేలపై ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో వరద ఉధృతి తగ్గగా శివాలయంక, గంటి పెదపూడి లంకల్లో ముంపు కొనసాగుతోంది. మామిడికుదురు మండలం అప్పనపల్లి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద ఎదురుబిడిం కాజ్‌వేలపై ఇంకా పడవల మీదనే ప్రయాణాలు సాగిస్తున్నారు. అప్పనపల్లి, కోటిపల్లి మత్స్యకార కాలనీ, నడవపల్లి, పల్లంకుర్రు మత్స్యకార కాలనీ, అప్పరామునిలంక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, బోడసకుర్రు పల్లిపాలేల్లో ఇళ్లు ఇంకా ముంపులోనే ఉన్నాయి.

ప్రభుత్వ సాయం పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముంపు బాధిత కుటుంబాలకు వరద సాయం కిట్ల పంపిణీని జిల్లా యంత్రాంగం మంగళవారం ప్రారంభించింది. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, లీటర్ పామాయిల్, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయలు ఉచితంగా అందిస్తున్నారు. లంక గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో ఇప్పటికే నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచారు. మామిడికుదురు, పి.గన్నవరం, అయినవిల్లి, మలికిపురం, ముమ్మిడివరం తదితర మండలాల్లో కిట్ల పంపిణీ మొదలైంది. కొన్ని గ్రామాల్లో ఇళ్లను శుభ్రం చేసుకున్న తర్వాత నిత్యావసర వస్తువులు కావాలని వరద బాధితులు కోరారు. దీంతో వారు కోరినప్పుడే ఇవ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.



పి.గన్నవరం: వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేసిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ఎస్.నుపూర్ అజయ్

వారం రోజులుగా..

గోదావరి వరద ఉధృతి 10 మండలాల్లోని 30 గ్రామాలపై వారం రోజులుగా ప్రభావం చూపింది. 3,175 కుటుంబాలకు చెందిన 10,612 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ముంపు బాధితులకు భోజనం, తాగునీరు, చిన్నారులకు పాలు అందించారు.

క్లుప్తంగా

వందేభారత్‌కు సామర్లకోటలో హాల్ట్



వంగా గీత

కాకినాడ: విశాఖపట్నం – సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ పడింది. దీనిపై కాకినాడ ఎంపీ వంగా గీత చేసిన ప్రయత్నాలు ఫలించాయి. రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఎంపీ గీత ఇటీవల కలిసి వందేభారత్ రైలుకు సామర్లకోటలో హాల్ట్ ఇవ్వాలని వినతి పత్రం అందించారు. దీనికి రైల్వే మంత్రి అందుకు అంగీకరించారు. సామర్లకోటలో హాల్ట్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్ కుమార్ సిన్హా మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు. వారం రోజుల వ్యవధిలోనే సామర్లకోట జంక్షన్‌లో ఈ రైలును ఆపేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేయనుంది. రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు ఎంపీ గీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో మాత్రమే హాల్ట్ ఉంది. సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రయాణికులకు గంటన్నర పడుతుంది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో ఈ రైలుకు రెండో హాల్ట్ సామర్లకోట ద్వారా సాకారమవుతోంది. సామర్లకోట హాల్ట్ వలన కాకినాడ జిల్లా ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కలగనుంది. సమయం, వ్యయం ఆదా కానున్నాయి.

సాగుబడిలో దేశీ సేవ

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు శిక్షణ
- వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై తరగతులు
- పరిశోధన కేంద్రాల ద్వారా ప్రయోగాత్మక విజ్ఞానం అందజేత
- వారే రైతులకు మార్గదర్శకులయ్యేలా ప్రభుత్వాల ప్రయత్నం

కొత్తపేట: అత్యధిక శాతం రైతులు సాగులో మొట్టమొదటిగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల సలహాలు, సూచనలే తీసుకుంటారు. వారు చెప్పిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే వినియోగిస్తారు. వారంటే అంత నమ్మకం. అయితే, ఆ డీలర్లలో చాలా మందికి తగినంత వ్యవసాయ పరిజ్ఞానం ఉండటం లేదు. దీంతో రైతులు నష్టపోతున్న సందర్భాలుంటున్నాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ డీలర్ల(వ్యవసాయ – ఇన్‌పుట్ డీలర్లు)కు అవసరమైన పరిజ్ఞానం అందించడం ద్వారా వ్యవసాయ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇది తగినంత పెట్టుబడితో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించేందుకు, తద్వారా వ్యవసాయంలో ఒక పెద్ద మార్పునకు దోహదపడతాయని భావించింది.

పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్‌గా..

కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం దేశంలోని సుమారు 2.82 లక్షల మంది వ్యవసాయ డీలర్లు ఉన్నారు. వీరిని పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్‌గా తయారు చేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (దేశీ) పేరుతో కోర్సు రూపొందించింది. వీరికి ఏడాదిలో 48 రోజుల పాటు రాయితీతో కూడిన శిక్షణ ఇస్తారు. ఈ దేశీ ప్రోగ్రామ్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) కొన్నేళ్ల క్రితం ప్రారంభించింది. ఈ శిక్షణను రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ, విస్తరణ శిక్షణ సంస్థల (సమేటి) ద్వారా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) జిల్లాల్లో నిర్వహిస్తుంది. దీనికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల స్థాయి రిటైర్డ్ అధికారులను ఫెసిలిటేటర్లుగా నియమిస్తారు. వారితో పాటు ప్రస్తుత అధికారులు, శాస్త్రవేత్తలతో డీలర్లకు ఈ శిక్షణ ఇప్పిస్తున్నారు. ఏడాది శిక్షణకు రూ.20 వేలు ఫీజు కాగా 50 శాతం రాయితీ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 40 మంది చొప్పున ఈ శిక్షణ ఇస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా గతంలోనే దేశీ కార్యక్రమం ప్రారంభమైనప్పటికీ పురోగతి అంతంత మాత్రమే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతు ప్రోత్సాహక, సంక్షేమ పథకాలతో పాటు దేశీ ప్రోగ్రామ్‌పై కూడా దృష్టి పెట్టారు. ప్రతి డీలర్‌కూ దేశీ శిక్షణ ఇప్పించి వారిని 'పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్'గా తయారు చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో ఎక్కువ బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆత్మ ద్వారా డీలర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,650 మంది డీలర్లుండగా ఇప్పటి వరకూ 15 బ్యాచ్‌లలో 600 మందికి శిక్షణ ఇచ్చారు. కొత్తపేట వ్యవసాయ సబ్ డివిజన్‌తో పాలు వివిధ మండలాలకు చెందిన 40 మంది డీలర్లకు గత ఏడాది మే నెలలో శిక్షణ ప్రారంభం కాగా, స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జూలై 26వ తేదీ వరకూ 40 థియరీ క్లాసులు నిర్వహించారు. మధ్యలో మరో 8 రోజుల పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటల పరిశోధన కేంద్రాలకు తీసుకువెళ్లి, వ్యవసాయ సాంకేతికతపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. జూలై 26న తుది పరీక్ష నిర్వహించారు. వారికి త్వరలోనే సర్టిఫికెట్లు అందజేస్తామని ఆత్మ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పిఠాపురం, రాజమహేంద్రవరాల్లో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.



పందిరిమామిడి ఉద్యాన పరిశోధన స్థానంలో డీలర్లకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

డీలర్లందరూ శిక్షణ పొందాలి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారం చేసే ప్రతి డీలరూ ఈ దేశీ శిక్షణ పొందాలి. వ్యవసాయ శాఖలో రిటైర్డ్ ఏడీలు, వివిధ పంటల పరిశోధన స్థానాల శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. ఇది వ్యవసాయ విజ్ఞానానికి ఎంతో దోహదపడుతుంది. శిక్షణ కోసం ఆత్మను సంప్రదించాలి.

– వై.జ్యోతిర్మయి, డీపీడీ, ఆత్మ, కాకినాడ

రైతులకు ప్రయోజనం



వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతుల్లో 70 శాతం మంది డీలర్ల నుంచి, 20 శాతం మంది పక్క రైతుల నుంచి, 10 శాతం మంది వ్యవసాయ శాఖ నుంచి సలహాలు తీసుకుంటున్నారు. డీలర్లకు అనుభవ పూర్వకంగా తప్ప శాస్త్రీయంగా, పరిశోధనాత్మకంగా వ్యవసాయ పరిజ్ఞానం తక్కువ. ఇటువంటి పరిస్థితుల్లో వారిని వ్యవసాయ విజ్ఞానవంతులుగా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దేశీ డిప్లొమా కోర్సులో శిక్షణ పొందిన డీలర్ల సలహాలు, సూచనలు రైతులకు ఉపయోగపడతాయి.

– వి.భాస్కరరావు, రిటైర్డ్ ఏడీఏ, దేశీ ఫెసిలిటేటర్

శిక్షణతో వ్యవసాయ విజ్ఞానం



డీలర్లు విధిగా దేశీ శిక్షణ తీసుకోవాలని అధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. మేమే పెడచెవిన పెడుతూ వచ్చాం. గత ఏడాది అధికారుల ఒత్తిడి మేరకు ఎప్పుడైనా తప్పదని ముందుకు వచ్చాం. ఏడాది పాటు థియరీ, పరిశోధనా కేంద్రాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా ఎంతో విజ్ఞానం పొందాం. పంటల సాగులో ఎన్నో మెళకువలు తెలుసుకున్నాం. ఈ శిక్షణ ప్రతి డీలరుకూ అవసరమే.

– చీకట్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడు, కోనసీమ డీలర్స్ అసోసియేషన్, కొత్తపేట

నయవంచకుడికి పదేళ్ల జైలు

కాకినాడ లీగల్: యువతికి మాయమాటలు చెప్పి, లైంగిక దాడికి పాల్పడి, పెళ్లి చేసుకోవడానికి ముఖం చాటేసిన నయవంచకుడికి పదేళ్ల జైలు, రూ.6 వేల జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..

కాకినాడ కొండేలుపేటకు చెందిన కొండేలు సంతోష్ కుమార్ అలియాస్ సోమేష్ అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ముఖం చాటేయడంతో బాధితురాలు 2018లో సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోర్టు విచారణలో సోమేష్‌పై నేరం రుజువైంది. లైంగిక దాడికి పాల్పడినందుకు పోక్సో చట్టం 5(1) ప్రకారం పదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా, నమ్మించి మోసం చేసినందుకు ఐపీసీ 417 ప్రకారం ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలూ ఏకకాలంలో అనుభవించాలని పేర్కొన్నారు.

ఇతరులకు అన్నదానం.. నో

- ఇకపై భక్తులకే భోజనం
- సిబ్బంది, ఇతరులు చేసే వీలు లేదు
- సత్యదేవుని సన్నిధిలో ఈఓ ఆదేశాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్న ప్రసాద పథకం(అన్నదానం)లో ఇకపై భక్తులు మినహా ఇతరులెవ్వరూ భోజనం చేయడానికి వీలు లేదు. ఈ మేరకు అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై దేవస్థానంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తర్వుల్లో ఏమన్నారంటే..

- అన్నదాన పథకంలో ప్రతి రోజూ 500 నుంచి వెయ్యి మంది వరకూ దేవస్థానం సిబ్బంది, షాపుల్లో పని చేసేవారు, ఇతర వ్యాపకాలతో వస్తున్న వారు భోజనం చేస్తున్నట్టు గుర్తించారు. దీనివలన భక్తులు ఇచ్చిన విరాళాలు ఏటా రూ.కోటి వరకూ దుర్వినియోగమవుతున్నట్టు తేలింది. ఇక నుంచి అటువంటి వారు అన్నదాన పథకంలో భోజనం చేయరాదు. భక్తులను మాత్రమే అన్నదాన భవనంలోకి అనుమతించాలి.
- దేవస్థానంలో పని చేసే రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది, వివిధ దుకాణాల్లో పని చేసేవారు విధిగా ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాలి.
- ప్రసాద తయారీ విభాగంలో పని చేసే ప్యాకర్లను శని, ఆదివారాలు, పర్వదినాల్లో మాత్రమే భోజనానికి అనుమతిస్తారు.
- దేవస్థానం డోనర్స్ భవనాల నిర్మాణ పనుల్లో పని చేసేవారిని ఇంజినీరింగ్ అధికారుల అనుమతి తీసుకున్నాకే భోజనానికి అనుమతించాలి.
- స్వచ్ఛంద సేవ చేసే వలంటీర్లను అనుమతించాలంటే పీఆర్ఓ అనుమతి తీసుకోవాలి.
- లిఖిత పూర్వక అనుమతి లేకుండా అన్నప్రసాద భవనం నుంచి ఆహార పదార్థాలను బయటకు పంపరాదు.
- అన్నప్రసాదం స్వీకరించే భక్తులు విధిగా నుదిటిన తిలకధారణ చేయాలి.

తాజా ఆదేశాలపై అసంతృప్తి

ఈఓ ఆదేశాలపై కొంతమంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్ష జీతం తీసుకునే ఉద్యోగులు కూడా అన్నదానంలోనే భోజనం చేస్తున్నారని కొంతమంది వ్యాఖ్యానించారు. అయితే, తాము భోజనాలు చేయకూడదనే ఆదేశాలపై కొంతమంది సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నదానం ప్రారంభించినప్పటి నుంచి అంటే సుమారు 30 సంవత్సరాలుగా దేవస్థానంలో పని చేస్తున్న కొంతమంది నాలుగో తరగతి సిబ్బంది ఇక్కడే భోజనం చేస్తున్నారు. అలాగే, ఇతర దేవస్థానాల నుంచి బదిలీ అయి వచ్చిన వారు, సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల సిబ్బందిలో కొంత మంది కూడా భోజనాలు చేస్తున్నారు. వీరందరూ వంద మందికి మించి ఉండరు. వీరందరూ తెల్లవారుజామున విధులకు హాజరై, సాయంత్రం వరకూ పని చేస్తారు. తమను అన్నదానంలో భోజనం చేయవద్దని నియంత్రించడంపై వీరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని ఈఓను కోరుతున్నారు.



అన్నదాన పథకంలో భోజనం చేస్తున్న భక్తులు (ఫైల్)

సత్యదేవుని అన్నదాన పథకం వివరాలు

విరాళాలు: రూ.20 కోట్లు
వీటిపై ఏటా వచ్చే వడ్డీ: సుమారు రూ.3.5 కోట్లు
ఏటా వచ్చే విరాళాలు రూ.3 కోట్లు
రోజూ భోజనాలు చేస్తున్న భక్తులు: 4 వేలు
భోజనాలకు ఏటా అయ్యే ఖర్చు: రూ.4.32 కోట్లు
ఏడాదికి ఒక భక్తునికి భోజనం పెట్టేందుకు అయ్యే ఖర్చు: రూ.10,950

ఆత్మగౌరవంతోనే మనసుకు సంతోషం



డీఈఓ కార్యాలయంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ

ముమ్మిడివరం: మనస్సుకు సంతోషాన్ని కలిగించే లేపనం వంటిది ఆత్మగౌరవమని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. ముమ్మిడివరం డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో పీడీ వి.శివశంకర ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పరిషత్ 2,852వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దీనిని ఎవరికి వారే గమనించుకోవాలని చెప్పారు. మనిషి బుద్ధి చాతుర్యతను పెంచే ఆయుధం మనస్సు అని అన్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని కొత్త ఆలోచనలతో నూతన మార్గాలను అన్వేషించడం మొదలు పెడితే గెలుపు సొంతమవుతుందని చెప్పారు. అలాగే జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో డీఈఓ ఎం.కమలకుమారి అధ్యక్షతన జరిగిన మరో సభలో కూడా సర్వేశ్వర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మనిషి ఊహకు, ఉత్పత్తికి సంబంధముందని, దీనికి కావలసిన ఆత్మవిశ్వాసం ఉంటే సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఏపీడీ ఎంఎం జిలానీ, డీపీఎం అన్నపూర్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయలక్ష్మి, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతానగరం: గోదావరిలో కొట్టుకుపోతున్న ఇద్దరిని స్థానికులు రక్షించారు. వారి కథనం ప్రకారం.. సింగవరం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఒక బాలుడు మరణించాడు. అతడి మృతదేహాన్ని బంధువులు, స్నేహితులు వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం ఖననం చేశారు. అనంతరం గోదావరిలో స్నానాలు చేయడానికి వెళ్లారు. వీరిలో కోడెల్లి శ్రీను, మానెల్లి భాస్కరరావు ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో కొట్టుకుపోయారు. గమనించిన మిగిలిన వారు భయంతో కేకలు వేశారు. వీరిలో స్నానాలు చేస్తున్న మణి, లక్ష్మణ్, అంబటి పండు వెంటనే ఈదుకుంటూ వెళ్లి, కొట్టుకుపోతున్న వారి వద్దకు చేరుకున్నారు. అక్కడే జాలర్ల నాటు పడవ ఉండటంతో కొంత మంది దానిపై వెళ్లి గోదావరిలో కొట్టుకుపోతున్న శ్రీను, భాస్కరరావులను ఒడ్డుకు చేర్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



గోదావరిలో కొట్టుకుపోతున్న వారిని రక్షించి, ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

ఉన్నత్ భారత్ అభియాన్‌పై వర్క్‌షాప్



ఉన్నత భారత్ అభియాన్‌పై వివరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉన్నత్ భారత్ అభియాన్‌పై యూ సెల్ ఆధ్వర్యాన ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో యువతను భాగస్వాముల్ని చేసేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ ఈ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. తమ కళాశాల సమీపాన ఉన్న గ్రామాల అభివృద్ధికి యూబీ సెల్ కృషి చేస్తుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని యూబీఏ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు తమ సమీప గ్రామాల్లోని సమస్యను విశ్లేషించి, పరిష్కారాన్ని సూచించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. నీటి వనరుల వినియోగంపై ఏఎస్‌డీ మహిళా కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు జి.పావనీదేవి వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ (మేనేజ్‌మెంట్)ఎంవీ హరినాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ శంభుప్రసాద్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, యూబీఏ కో ఆర్డినేటర్ ఫణి భాస్కర్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 నుంచి ఉమ్మడి ఏపీ షటిల్ టోర్నమెంట్

అమలాపురం టౌన్: స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఇన్‌డోర్ కోర్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు ఈ విషయం తెలిపారు. అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ సూచనలతో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. మెన్స్ డబుల్స్, వెటరన్స్ డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మెన్స్ డబుల్స్ విన్నర్‌కు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని టోర్నమెంట్ నిర్వాహకుడు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ తెలిపారు. వెటరన్స్ డబుల్స్‌లో విన్నర్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. సాధనాల శ్రీనివాసరావు మెమోరియల్ పేరిట నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ప్రచార పోస్టర్లను అసోసియేషన్ ప్రతినిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో సాత్విక్ సాయిరాజ్ తల్లిదండ్రులు రంకిరెడ్డి కాశీ, రంగమణి, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ పీఎస్ శర్మ, యాళ్ల నాగ సతీష్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, కల్వకొలను బాబు, నల్లా శివ, వంటెద్దు బాబీ, చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కక్ష కట్టి.. కడతేర్చారు

- మహేంద్రవాడ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిషోర్ కుమార్

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ తూర్పు పుంతలో గత నెల 30న వెలుగు చూసిన సత్తి నారాయణ రెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మహేంద్రవాడకు చెందిన నారాయణరెడ్డి తాపీ మేస్త్రిగా జీవించేవాడు. అతడి వద్ద అదే గ్రామానికి చెందిన కర్రి నాగిరెడ్డి కొంత కాలం నుంచి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తరచూ నాగిరెడ్డి ఇంటికి వెళ్లే నారాయణరెడ్డి.. నాగిరెడ్డి భార్యపై కన్ను వేశాడు. కోరిక తీర్చాలని వేధించేవాడు. విషయాన్ని ఆమె భర్త నాగిరెడ్డికి చెప్పింది. ఈ నేపథ్యంలో నారాయణరెడ్డిపై కక్ష పెంచుకున్న నాగిరెడ్డి.. అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. గత నెల 29వ రాత్రి నారాయణరెడ్డికి ఫోన్ చేసి, మద్యం తాగుదామని పిలిచాడు. వెంట తెచ్చుకున్న స్టీల్ రాడ్డుతో అక్కడకు వచ్చిన నారాయణరెడ్డి తల వెనుక భాగంలో పలుమార్లు కొట్టి హతమార్చాడు. ఈ హత్యలో నాగిరెడ్డి కుమారుడు (మైనర్) కూడా భాగం పంచుకున్నాడు. హతుడి కాల్ డేటా ఆధారంగా పోలీసులు ఈ కేసుపై ముమ్మర దర్యాప్తు చేపట్టారు. గత నెల 30వ తేదీ నుంచి నాగిరెడ్డి గ్రామంలో లేడని గుర్తించి, నిఘా పెట్టారు. విషయం తెలుసుకుని భయపడిన ముద్దాయి, అతడి కుమారుడు మహేంద్రవాడ సచివాలయం వీఆర్ఓ ఎదుట మంగళవారం లొంగిపోయారు. నిందితులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేసి, త్వరితగతిన ఛేదించిన సీఐ వి.శ్రీనివాస్, ఎస్సై పి.అప్పారావుతో పాటు ఏఎస్సై వీర్రాజు, హెడ్ కానిస్టేబుళ్లు పి.రఘు, ఐ.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు తమ్మారావు, త్రిమూర్తులు, దుర్గాప్రసాద్‌లను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారని డీఎస్పీ తెలిపారు.



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్ కుమార్

వ్యసనాలకు బానిసలై.. చోరీల బాట



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్ల వద్ద అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా తదితరులు

- ముగ్గురు మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు
- 30 బైక్‌లు స్వాధీనం

రామచంద్రపురం: మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం రామచంద్రపురంలో అరెస్టు చేశారు. రామచంద్రపురం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఈ వివరాలు వెల్లడించారు. జూలై 27వ తేదీన రామచంద్రపురం మెయిన్ రోడ్డులోని కోస్టల్ బ్యాంకు వద్ద ఒక మోటార్ సైకిల్ చోరీ అయ్యింది. ఆ వాహన యజమాని ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు ఇటీవల చోరీకి గురైన వాహనాలను గుర్తించేందుకు రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యాన జిల్లా సీసీఎస్ సీఐ డి.గోవిందరావు, ఎస్సై డీబీ సంపత్, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఒక బృందంగా.. రామచంద్రపురం సీఐ వి.దుర్గారావు, ఎస్సై డి.సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ టి.సూరిబాబు మరో బృందంగా ముద్దాయిల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బైపాస్ రోడ్డులోని కొత్తూరు వద్ద కోస్టల్ బ్యాంక్ వద్ద చోరీకి గురైన మోటార్ సైకిల్‌పై ముగ్గురు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిని ప్రశ్నించగా పట్టణానికి చెందిన గోరస శ్రీనివాస్, వడగన శంకర్ దుర్గ, వెల్ల గ్రామానికి చెందిన శీలి అనిల్‌గా గుర్తించారు. ఈ ముగ్గురూ స్నేహితులుగా ఉంటూ, చెడు వ్యసనాలకు బానిసలై, మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారని అన్నారు. వీరు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, పామర్రు, అన్నవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, సర్పవరం, పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిళ్లు దొంగిలించినట్టు పోలీసుల విచారణలో తేలింది. వీరి నుంచి 30 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.